మధ్యాహ్నం పదకొండు గంటలయింది. సీతారామయ్యగారింట్లో పిల్లా, పెద్దా అంతా భోజనాలు ముగించివచ్చి, హాల్లో కూర్చున్నారు. సీతారామయ్యగారు వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఆయన భార్య వెంకమాంబ భర్త కుర్చీ ప్రక్కనే కూర్చుని తమలపాకులకు సున్నం రాసి భర్తకి అందిస్తున్నారు.

రాధ ఒకవార గోడకి చేరగిలబడి, కూర్చొని ఏదో పత్రిక చదువుకుంటున్నది—రాధ సీతారామయ్యగారి పెద్దకూతురు. క్రిందటి సంవత్సరమే పెళ్లి అయింది. తక్కిన ఇద్దరు పిల్లలు—రామం, రవి ఆడుకుంటున్నారు.

అంతవరకు తీక్షణంగాఉన్న ఎండ హఠాత్తుగా పోయి, మబ్బు పట్టింది. కొన్ని నిముషాలలోనే మబ్బులు దట్టమయి, వర్షం మొదలెట్టింది. వాన మొదట చినుకులుగ ప్రారంభించినా, రాను రాను ఎక్కువ కాసాగింది.

ఇంత హఠాత్తుగా పట్టుకున్న వాననిచూచి, వెంకమాంబ చిరాకు పడ్డారు. "అంతా దొంగవాన. హఠాత్తుగ ముంచుకొచ్చింది. ఎప్పుడు తగ్గుతుందో ఏమో! ఇంకా చేయవలసినవి చాల పనులున్నాయి" అని విసుక్కుంటూ లేచివెళ్ళి కిటికీ తలుపులు మూశారు, జల్లు లోపలికి కొడుతుందేమోనన్న భయంతో. జల్లు కొట్టనే కొట్టింది. తలుపు సందుల్లోంచి.

ముఖంమీదపడ్డ నీటి చినుకులను తుడుచుకుంటూ, వెంకమాంబ భర్త కుర్చీప్రక్కన చదికిల బడ్డారు.

"ఏమండీ! పండుగకి అల్లుడి కివ్వడానికి బట్టలు కొంటానన్నారుగా. ఇంకా ఎప్పుడు కొంటారు?" అని అడిగారు.

"మధ్యాహ్నం బండికి వస్తాడుగా. అతడు వచ్చాక, అతని కిష్టమైన బట్టలే కొందాం" అని మరలా పేపరు చదవడంలో మునిగిపోయారు ఆయన. తలవంచుకొని పత్రిక చదువుకుంటున్న రాధ, తన భర్త ప్రసక్తిరాగానే ఒక్కసారి తలఎత్తి చూసి, మళ్లీ తలదించేసుకుంది.

"ఈ వర్షం ఇంకా ఇలాగేవుంటే స్టేషనుకు వెళ్ళి, బావను తీసుకురావడం చాల కష్టమమ్మా. రోడ్లన్నీ బురదగా ఉంటాయి. అదీగాక, మనింట్లో గొడుగు కూడాలేదు" అన్నాడు ఒకమూల కూర్చుని తమ్ముడితో ఆడుకుంటున్న రామం.

సీతారామయ్యగారు పేపరు చదవడం పూర్తి చేశారు. దాన్ని ప్రక్కనున్న టేబిలుమీద పడేస్తూ, ఆయన అన్నారు:

"ఈవాన ఇంకా ఎంతోసేపు ఉండదులే. వెలిసిపోతుంది. వాన తగ్గకపోతే నువ్వు వెళ్ళనక్కర లేదులే. రిక్షాలోవచ్చేస్తాడు ఇంటికి. ఇల్లు తెలుసుగా."

వెంటనే అందుకొని రామం, "ఏమో స్టేషనుకు వెళ్లకపోతే బావకి కోపం వస్తుందేమోనని. బావకి వచ్చినా, రాకపోయినా, అక్కయ్యకుమాత్రం వచ్చేస్తుంది ఎక్కడలేని కోపం" అన్నాడు నవ్వుతూ.

రాధకి ఉక్రోషం వచ్చేసింది. "నువ్వు వెళ్ళనవసరం లేదులేరా" అంది. ఆ ఉక్రోషం అంతా ఆమె మాటలలో ధ్వనించింది.

అంతా నవ్వుకున్నారు. ఈ విషయాలన్నీ తన కనవసరమన్నట్లు చిన్నవాడు ఆడుకుంటున్నాడు. వాడి మనస్సు ఇపుడు కాగితపు పడవలమీదేవుంది. వర్షానికి వాళ్ల పెరట్లో చేరిన నీటిలో కాగితపు పడవలతో ఆడుకోవాలని వాడి ఉబలాటం. అందుకే తలెత్తకుండా కాగితాలతో పడవలుచేసి పారేస్తున్నాడు.

సీతారామయ్యగారు మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్ళి, తలుపులుతెరచి, బయటకు తొంగిచూశారు. వాన జోరుగానే కురుస్తోంది. కాగితపు పడవలు పట్టుకొని, అంత వర్షంలోను పిల్లలు ఇళ్లనుండి బయటకువచ్చి, సైడు కాలవలలో వదలుతున్నారు. ఆ పడవలు కొంతదూరం వెళ్లేటప్పటికే తడిసి ముద్దయి మునిగిపోతున్నాయి. వాటిని మునగకుండా చేయడం ఆ పసిపిల్లలకు చేతకావటంలేదు. కాని వాళ్లకి చేతనయింది ఒక్కటే—పాత పడవలు మునిగి మునగకముందే క్రొత్త పడవలుతెచ్చి, నీళ్లలో వేయడం.

ఇదంతా చూస్తుంటే సీతారామయ్యగారికి తన చిన్ననాటి ఆటలు గుర్తుకు వచ్చాయి. అప్పుడు కాగితం పడవలు చేయడంలో తనే ఫస్టు. ఓహో! ఎన్నెన్ని రకాల కాగితపు పడవలు చేసేవాడో తను!

అవి తలచుకుంటే ఆయన కిప్పుడు పడవలు



బయి'లని కోరిక పుట్టింది. వెంటనే ఒక కాగితం తీసికొని, పడవ చేయబోయారు. ఎన్ని తంటాలు పడినా కుదరలేదు. ఇంతలో చిన్న పిల్లాడు రవివచ్చి ఆయన చేతిలోని కాగితాన్ని తీసుకున్నాడు.

ఆయన సంభ్రమంతో చూస్తున్నారు.

రవి మూడు నిముషాలలో పడవని తయారు చేశాడు.

సీతారామయ్యగారికి ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చింది.

చిన్నప్పుడు తను చేసిన పనే ఇప్పుడు చేయబోతే కుదరలేదు!

ఇంతలో "టెలిగ్రాం సార్!" అని బయట నుండి పోస్టుమేన్ కేక వేశాడు.

రెయిన్‌కోటు, నెత్తిమీద టోపీతో పోస్టుమేన్ గుమ్మంవరకు వచ్చి మరలా కేక వేశాడు. సీతారామయ్యగారు సంతకంచేసి టెలిగ్రాం అందుకున్నారు.

టెలిగ్రాం అను కేక వినబడగానే వంటింట్లో ఉన్న వెంకుమాంబ, రాధ—అందరూ హాల్లోకి పరుగెత్తుకొని వచ్చారు. అది ఎక్కడినుండి వచ్చిందో నను కుతూహలం వాళ్ల ముఖాలలో ప్రస్ఫుటమవుతోంది.

సీతారామయ్యగారు కవరుచింపి చదివారు. ఆయన వేడి నిట్టూర్పు విడిచి వాలుకుర్చీలో కూలబడ్డారు.

అదిచూసి వెంకుమాంబ గాభరాపడ్డారు. "ఎక్కనుండండి టెలిగ్రాం" అని అడిగారు.

"అల్లుడి దగ్గరనుండి"

దానితో రాధ గాభరా ఎక్కువయింది.

"సెలవు దొరకలేదు. నేను వచ్చుటకు వీలు పడదు" అని వ్రాశాడు అల్లుడు" అన్నారు సీతారామయ్యగారు నిట్టూర్చుతూ.

తెల్లగానున్న రాధమ్ముఖం ఎర్రబడింది. వెంకుమాంబ ఇంకా ఆశ్చర్యంనుండి తేరుకొనేలేదు. సీతారామయ్యగారు వాలుకుర్చీలో వెనక్కి జేరగిలబడ్డారు. ఆయన కుర్చీప్రక్కనే నేలమీద చదికిలబడ్డారు వెంకుమాంబ.

సీతారామయ్యగారు రాధవైపుచూచి అడిగారు. "ఏవమ్మా! నీతో ఏమని చెప్పాడు మీ ఆయన. పండుగకు వారంరోజులు సెలవుపెట్టి ముందుగానే వస్తాననికదూ! అలాగ అనేకదా! నిన్ను పదిహేనురోజులు ముందుగ పంపేడు. నాకు కూడ వ్రాశాడుగా. ఇవాళ మధ్యాహ్నం ఇక్కడకు వస్తానని. మళ్లీ ఇప్పుడు ఈ టెలిగ్రాం ఏమిటి!"

ఏమోనాన్నా. 'ఆఫీసరు చాల మంచివాడు. తప్పకుండా సెలవు దొరుకుతుంది' అన్నారు" అంది రాధ.

"ఈ ఆఫీసర్లు బొత్తిగ హృదయంలేనివాళ్లు అయిపోతున్నారు. పండుగకు అత్తవారింటికి వెడతామన్నా సెలవు ఇవ్వరు" అని అన్నారు వెంకుమాంబ.

"సెలవు దొరికితే ఎందుకురాడు?" సీతారామయ్యగారు అన్నారు.

వెంకుమాంబకి సందేహాలు పుట్టుకొచ్చాయి. అల్లుడికి ఏమేనా కోర్కెలున్నాయేమోనని. ఆ మాట గట్టిగా అన్నారు.

"ఏమే నా కోరికలేవో!" అని.

"ఏమైనా కోరికలువుంటే మాటిగ అడగవచ్చుగా! మాకువీలైతే ఇస్తాము" అని సీతారామయ్యగారు రాధవంకచూచి అడిగారు. "నీతో ఏమైనా చెప్పాడా అమ్మా?" అని.

"నాతో ఏమీ చెప్పలేదు.....కానీ....." నసిగింది రాధ.

"సరిగ్గా చెప్పమ్మా రాధా."

"చాల కాలమ్మై, సైకిలు కొనుక్కుందామను కుంటున్నారు. ఆఫీసు చాల దూరం. అంతదూరం రోజూ నడిచివెళ్ళడం ఇబ్బందిగావుంది. అందుచేత ఏదో ఒక సైకిలు వెంటనే కొనుక్కోవాలని అనుకుంటున్నారు. కానీ వీలుపడటంలేదు. మరి సైకిలు కావాలని కోరిక కాబోలు. ఏమో. నాతో ఏమీ చెప్పలేదు.

"ఒకసారిమాత్రం అన్నారు. మీ నాన్న నాకు సైకిలు ఇవ్వరా అని. హాస్యమేమో అనుకున్నాను" అన్నది రాధ.

అల్లుడి కోరికవిని నిర్విణ్ణులయ్యారు సీతారామయ్యగారు. సైకిలు కొనడం అంటే మాటలుకాదు. అధమపక్షం రెండు వందలయినా. ఉండాలి తన దగ్గర ఇప్పుడు అంత డబ్బులేదు.....ఇప్పుడేమిటి? ఎప్పుడూ ఉండదు. ఎలా ఉంటుంది? వచ్చింది తిండికి, బట్టకే బొటాబొటిగ సరిపోతుంది. వెనుక వెయ్యడానికి ఎలా వీలుపడుతుంది?

పండుగకు అల్లుడికి, కూతురుకూ బట్టలు కొనడానికి స్నేహితుని దగ్గర అరవై రూపాయలు అప్పుతెచ్చారు. ఇంకా ఆ బట్టలు కొననేలేదు. దానిపై ఇంకో నూటయాభై ఉంటేనేగాని, సైకిలురాదు. అంత డబ్బు తన కిప్పుడు ఎక్కడనుండి వస్తుంది?... ఏమిటి చెయ్యడం ఇప్పుడు?......

సీతారామయ్యగారు మౌనంగా కూర్చుని ఆలోచిస్తున్నారు. ఆయనకు తన పెళ్లయిన క్రొత్తలో జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చాయి.....

తన మామగారు ఏమంత డబ్బు ఉన్నవాడు కాదు. ఏదో సంసారపక్షంగా జీవయాత్ర సాగించుతున్నవాడు. తనకు పెళ్ళికి కానుకగా ఇస్తానన్న రేడియో పెళ్లిలో ఇవ్వలేక తరువాత ఇస్తానన్నాడు. తను సరే ననక తప్పిందికాదు.

కానీ, వీలుపడక సంవత్సరం దాటినా రేడియో ఇవ్వలేకపోయాడు ఆయన. తనకు కోపం వచ్చింది.

ఆ ఏటి సంక్రాంతికి రమ్మని తనకు ఉత్తరం వచ్చింది మామగారి దగ్గరనుండి. ఆఫీసునుండి ఇంటికి రాగానే తను వెంకుమాంబకి చెప్పాడు ఉత్తరం గురించి. ఆవిడ చాల ఉత్సాహంగానేవుంది పుట్టింటికి వెళ్దామని. కాని, తను మాత్రం, "ఆ! నువ్వు ఎప్పుడూ ఇంతే. పుట్టింటికి వెడదామని సరదాయే గాని, నా సంగతి పట్టించుకోవు" అన్నాడు విసుక్కుంటూ.

ఆవిడ చాల నొచ్చుకుంది తన మాటలకి. తను అన్నాడు, "మీ నాన్న క్రిందటి సంవత్సరమే రేడియో ఇస్తానన్నారు. కాని, ఏది? ఇంతవరకు ఇవ్వలేదు. ఈసారి ఆ రేడియో ఇస్తేనేగాని, నేను రాను. కావలసి వస్తే నువ్వు వెళ్ళు. నేనుమాత్రం రాను."

పాపం. ఈ విషయం తెలిసి నానా తంటాలుపడి రేడియో కొన్నాడు తన మామగారు.....

పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యానుగురించిన్నీ మీరు తెలుసుకోనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-25 న. పై.లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.

కుటుంబము అంతకీ...

కాల్గేట్ ఆల్ - పర్పస్ టాల్కులో వింతైన పుష్పముల చాలసేపు ఉండే పరిమళము లభిస్తుంది

పోడుపు మరియు పేరుగాంచిన కాల్గేట్ నాణ్యత....

స్నానానంతరము, దుస్తులు ధరించే ముందు మరియు వీధిలోకి వెళ్లనపుడు. కాల్గేట్ టాల్కును మీ ఒళ్లంతా జల్లుకోండి....



మృదువైన మరియు సౌమ్యమైన యీ పౌడరు పాపాయి లేత చర్మమునకు దివ్యమైనది.



కాల్గేట్
ఆల్-పర్పస్ టాల్క్

CAPT. 6.1-TEL

వాన వెలిసింది

పాత సంఘటనలను తలచుకోగానే సీతారామయ్యగారికి సిగ్గువేసింది. ఎదురుగా టేబిలుమీదనున్న రేడియో అతని సిగ్గును అధికం చేసింది.

సీతారామయ్యగారికి అంత విషమ పరిస్థితిలోను నవ్వు వచ్చింది! అల్లుడుగా తను మామగారిని వేధించుకొని తిన్నాడు. ఇప్పుడు తన అల్లునివంతు కోరికలు కోరుకోవడానికి.....

వెంకుమాంబ పిలుపుతో, ఆలోచనలలోంచి తేరుకున్నారు సీతారామయ్యగారు. ఆయన్ని ఉద్దేశించి ఆవిడ అన్నారు.

"ఎలాగైనా అప్పో సొప్పోచేసి కొనాలండి సైకిలు. తప్పదు. పండుగకి అల్లుడు ఇంటికి రాకపోతే ఎలాగ? ఇదేగా మొదటిసారి. అల్లుడు రాకపోతే అమ్మాయి బాధపడదూ?"

రాధకి నిజంగానే దుఃఖం ఆగలేదు. గదిలోనికి వెళ్ళిపోయింది.

ఆమెనుచూస్తే సీతారామయ్యగారికి కూడ దుఃఖం ఆగలేదు. మాట్లాడలేకపోయారు.

వెంకుమాంబ 'టేబిలు దగ్గరకువెళ్ళి, డ్రాయరు లోనుండి పెన్నూ, కాగితంతెచ్చి సీతారామయ్యగారికిస్తూ, "అల్లుడికి ఉత్తరం వ్రాయండి. 'నీ కోరిక అమ్మాయి చెప్పింది. దాని ప్రకారమే సైకిలుకొని ఇస్తాము. పండుగకు తప్పక రమ్మని వ్రాయండి" అన్నారు.

సీతారామయ్యగారు ఒక వేడి నిట్టూర్పు విడుస్తూ పెన్నుకేపు తీశారు, అల్లుడికి ఉత్తరం వ్రాద్దామని. 'చిరంజీవికృష్ణారావుకు' అనిమొదలుపెట్టారుఉత్తరం.

దూరాన రైలుబండి కూత పెట్టింది.

"వస్తే ఈ బండిలోనే వచ్చేవాడు అల్లుడు" అని బిగ్గరగానే అన్నారు వెంకుమాంబ.

సీతారామయ్యగారు ఉత్తరం వ్రాస్తున్నారు.

బయట వాన కొంచెం తగ్గినట్లుంది. వీధి గేటుదగ్గర రిక్షా ఆగిన చప్పుడయింది. సీతారామయ్యగారు, వెంకుమాంబ ఆతృతగా వీధివైపు చూశారు. రామం పరుగెత్తుకొనివెళ్ళి వీధి తలుపుతీసి చూశాడు.

"బావ వచ్చాడరోయ్" ఒక్కకేకపెట్టి వీధిలోకి పరుగెత్తాడు.

అందరూ వీధిగుమ్మంవరకు వచ్చారు.

ప్రక్కగదిలోఉన్న రాధ మాత్రం రామం హాస్యం ఆడుతున్నాడేమోననుకుంది. కాని, హాల్లో భర్త మాటలు వినబడి, హాలు గుమ్మంవరకు వచ్చింది.

నిజంగానే వచ్చారు! రాధ మనస్సు తేలిక పడింది.

వెంకుమాంబ అడిగారు అలుడిని. "ఏం నాయనా. టెలిగ్రాంలో అలా వ్రాశావేం?" అని.

"హఠాత్తుగ మీకు కనబడాలని అనుకున్నానండీ" అన్నాడు కృష్ణారావు.

"అలా చేయబట్టే బావగారు ఇప్పుడు వానలో తడియవలసి వచ్చింది" అన్నాడు రామం నవ్వుతూ.

అంతా నవ్వుకున్నారు. కృష్ణారావు ఎవరూ చూడకుండా రాధవైపుచూసి వెక్కిరించాడు. రాధ మాత్రం తక్కువదా! తిరిగి వెక్కిరించి వెనుదిరిగి గదిలోకి పారిపోయింది.

"ఎలాగైనా కొంటెవాడివోయ్ కృష్ణారావూ!" అన్నారు సీతారామయ్యగారు.

వాన పూర్తిగ వెలిసింది. ★